సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 25 । ఏప్రిల్ । 2024



వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలనేది జనం కోరిక

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలనేది జనం కోరిక అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. -8లో



వైఎస్సార్ సీపీలోకి చేరికలు

పెండ్లిమర్రి మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని వెంకట్రామ్‌పల్లెలో 20 కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే పి.రవీంద్ర నాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. -8లో

గరిష్టం/కనిష్టం
43.6/25.8

వాతావరణం

జిల్లాలో బధవారం 25.8 – 43.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల పరిశీలన



సీఎస్ఐ చర్చి మైదానంలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించే ప్రాంతాలను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పరిశీలించారు. బుధవారం భాకరాపురం సమీపంలో ఉన్న హెలిప్యాడ్, సీఎస్ఐ చర్చి మైదానంలో నిర్వహించే బహిరంగ సభ ప్రాంతాలను, అక్కడి నుంచి అంబకపల్లె రోడ్డులో ఉన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయ పరిసర ప్రాంతాల్లో బందోబస్తు, తదితర అంశాల గురించి అధికారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆయన నామినేషన్ వేసేందుకు వచ్చే రహదారిలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కడపకు చేరుకున్న పోలీస్ అబ్జర్వర్

కడప అర్బన్: కేంద్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు కడప పార్లమెంటరీ పోలీస్ అబ్జర్వర్‌గా నియమితులైన హిమాచల్ ప్రదేశ్ సిమ్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న అర్జిత్ సేన్ ఠాకూర్ బుధవారం సాయంత్రం కడపకు చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన కడపలోని పోలీస్ అతిథిగృహంలో ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం కడపలో జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను కలిసి తమ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

జాతీయ లోక్ అదాలత్ తేదీ మార్పు

కడప అర్బన్: జాతీయ లోక్ అదాలత్ జరిగే తేదీని ఉన్నతాధికారులు వాయిదా వేశారు. రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశానుసారం జాతీయలోక్ అదాలత్ షెడ్యూల్ మే 11న (రెండవ శనివారం) జరగాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికలు, వేసవి సెలవులు కారణంగా జూన్ 29న (ఐదవ శనివారం)కు వాయిదా వేసినట్లు జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.


ఎంపీ అభినందన



కార్తీక్ రెడ్డిని అభినందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

జమ్మలమడుగు: తెలంగాణ రాష్ట్రంలో ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మొదటి సంవత్సరం ఎంపీసీలో జమ్మలమడుగుకు చెందిన మల్కిరెడ్డి కార్తీక్‌రెడ్డి 470 మార్కులకు గాను467 మార్కులు సాధించి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచాడు. హైదరాబాద్‌లోని మైటీ కళాశాలలో చదువుతున్న ఇతను మ్యాథమ్యాటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో సెంట్ పర్సెంట్ మార్కులు సాధించడం విశేషం. ఇతను వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్కిరెడ్డి హనుమంత రెడ్డి కుమా రుడు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన కార్తీక్ రెడ్డిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అభినందించారు.

ఏఎఫ్‌యూ సెమిస్టర్ ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన ప్రథమ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి విడుదల చేశారు. బుధవారం విశ్వవిద్యాలయంలో పరీక్షా విభాగంతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. పరీక్షా ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

నాడు చంద్రగ్రహణం.. నేడు జగనానందకారకం

- టీడీపీ హయాంలో జిల్లాలో కనిపించని అభివృద్ధి
- నీరు–చెట్టు పథకంతో తెలుగు తమ్ముళ్ల దోపిడీ
- సీఎం జగన్ పాలనలో సమగ్రాభివృద్ధి
- రిమ్స్‌లో రూ.272.81 కోట్లతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- పులివెందులలో రూ.500 కోట్లతో నూతన మెడికల్ కళాశాల
- నాడు–నేడు పథకం ద్వారా రూ.409 కోట్లతో పాఠశాలల అభివృద్ధి
- రూ.220 కోట్లతో కడప సుందరీకరణ
- ప్రైవేటు సెక్టార్‌లో వేగంగా పారిశ్రామిక ప్రగతి



పులివెందులలో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రారంభోత్సవంలో వైద్యులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

సాక్షి ప్రతినిధి, కడప: చీకటి కొన్నాళ్లు.. వెలుగు కొన్నాళ్లు అన్నది జగమెరిగిన సత్యం. జిల్లా అభివృద్ధి విషయంలో కూడా అదే పరిస్థితి ప్రస్ఫుటమైంది. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో జిల్లాకు చంద్రగ్రహణం పట్టగా, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించింది. నాడు చంద్రబాబు అస్మదీయులకు దోచి పెట్టేందుకు నీరు–చెట్టు పథకం ప్రవేశపెట్టగా, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు సైతం కార్పొరేట్ చదువులు అందించేందుకు నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. మరోవైపు సామాన్యులకు వైద్యసేవలు అందించడంలోనూ అదే స్థాయిలో చర్యలు చేపట్టారు. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి ఇలా అన్ని రంగాల్లోనూ జిల్లాను అగ్రగామిగా నిలబెట్టేందుకు విశేష కృషి చేశారు. ఈ ఐదేళ్లలో జిల్లాలో అభివృద్ధి పరుగులు తీసింది.

కడప సమీపంలో ఉన్న కొప్పర్తి పారిశ్రామిక వాడ 2014–19 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైంది. ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. 801 ఎకరాలలో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్(వైఎస్సార్–ఈఎంసీ) నెలకొల్పారు. రూ.10వేల కోట్ల పెట్టుబడులు సమీకరించి లక్ష ఉద్యోగాల కల్పనకు ప్రణాళికలు రచించారు. ఇప్పటికే ఆల్‌డిక్సన్ కంపెనీ (ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ) ప్రారంభమైంది. ఈ సంస్థలో 1100 మంది యువతకు ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించాయి. మరో 1800 మందికి ఉపాధి లభించేలా సంస్థను విస్తరిస్తున్నారు. బద్వేలు నియోజకవర్గం గోపవరం సమీపంలో సెంచురీ ప్లైబోర్డ్స్ పరిశ్రమ వచ్చి చేరింది. 589.23 ఎకరాలలో రూ.956 కోట్ల అంచనాతో శ్రీకారం చుట్టిన ఆ సంస్థ పెట్టుబడులు రూ.1600 కోట్లకు చేరాయి. ఈ పరిశ్రమ ద్వారా 2076 మంది స్థానికులకు ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించాయి.

చరిత్ర తిరగరాయనున్న నాడు–నేడు...

నాడు–నేడు పథకం చరిత్రను తిరగరాయనుంది. సామాన్యులకు అందుబాటులో ఇంగ్లీషు మీడియం డిజిటల్ విద్యాసేవలు వచ్చాయి. జిల్లాలో జిల్లా వ్యాప్తంగా 1723 ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులతో సరికొత్త భవనాలతో రూపుదిద్దుకున్నాయి. రూ.409.86 కోట్లు వెచ్చించి సకల సౌకర్యాలను కల్పించారు. జిల్లాలో నూతనంగా వ్యవసాయ, ఉద్యాన కళాశాలలు వచ్చిచేరాయి. రూ.32.82 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేశారు. పులివెందులలో రూ.39 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ గార్డన్, రూ.69 కోట్లతో ఉలిమెల్ల చెరువు సుందరీకరణ పూర్తి కానున్నాయి. రూ.24 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్, డిపో ఏర్పాటు చేశారు. పాడా నిధుల ద్వారా భూగర్భ డ్రైనేజీ, రహదారుల విస్తరణ, నూతన రోడ్లు ఏర్పాటు చేపట్టారు. రూ.5.60 కోట్లతో పార్నపల్లె వద్ద చిత్రావతి జలాశయంలో బోటింగ్ సౌకర్యం కల్పించారు. అధునాతన పార్కులు, సుందరంగా రహదారులు, రింగ్‌రోడ్లు సర్కిళ్లు తీర్చిదిద్దారు.

నాడు నీరు–చెట్టు పథకంతో మమ...

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో (2014–19) జిల్లాలో అభివృద్ధి అంటూ చెప్పుకోవాల్సి వస్తే నీరు–చెట్టు పథకమే. అందులో దాదాపు రూ.600 కోట్ల పనులు జిల్లా వ్యాప్తంగా చేపట్టారు. భూగర్భ జలాలు పెంచే లక్ష్యంతో చేపట్టిన ఆ పనుల ఉద్దేశాన్ని చంద్రబాబు సర్కార్ నీరు గార్చింది. వంకల్లో పూడికతీత పేరుతో తెలుగుతమ్ముళ్లను సంతృప్తి పరిచారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అప్పట్లో మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద ఉక్కు ఫ్యాక్టరీకి సీఎం హోదాలో చంద్రబాబు శంకుస్థాపనతో సరిపెట్టారు. చంద్రబాబు సర్కార్‌లో నిర్దిష్టమైన అభివృద్ధి ఏదీ లేదని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా ప్రజానీకం గత పాలనను, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకుంటున్నారని చెప్పవచ్చు.

మెడికల్ హబ్‌గా రిమ్స్...

రిమ్స్ వైద్యశాల ప్రాంగణాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దారు. రూ.272.81 కోట్లతో మూడు అధునాతన వైద్యశాలలను నిర్మించారు. 452 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, 100 పడకల మానసిక వైద్యశాల, 100 పడకల కేన్సర్ హాస్పిటల్‌ను నెలకొల్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 180 ఎకరాల విస్తీర్ణంలో రూ.220 కోట్ల వ్యయంతో 'రిమ్స్' వైద్య కళాశాల, దంత వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రూ.272.81 కోట్లు వెచ్చించి, సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్డియాలజీ, పీడియాట్రిక్, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇకపై మన కడపలో రిమ్స్‌లో లభించనున్నాయి. మరోవైపు పుష్పగిరి కంటి ఆస్పత్రి, ఇంకోవైపు డాక్టర్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని సైతం అందుబాటులోకి తెచ్చారు. మరో రూ.500 కోట్లతో పులివెందుల కేంద్రంగా ప్రభుత్వ వైద్యకళాశాల, వైద్యశాల, నర్సింగ్ కళాశాలను నెలకొల్పారు.

సుందర కడపగా...

కడప నగరం సుందరంగా రూపుదిద్దుకుంది. రహదారుల విస్తరణ శరవేగంగా చేపట్టారు. రూ.120 కోట్లతో నగరంలోని 12 జంక్షన్లను అభివృద్ధి చేశారు. రూ.6.85 కోట్లతో రాజీవ్‌మార్గ్ రోడ్డు, రాజీవ్ పార్కును ఆధునీకీకరించారు. రూ.69.2 కోట్లతో పాత బళ్లారి రోడ్డు, రూ.100 కోట్లతో దేవుని కడప రోడ్డు విస్తరణ చేపట్టారు. రూ.10 కోట్లతో ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు నిర్మించారు. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో రూ.8.27 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు.

కడప సిగలో మణిహారం

జమ్మలమడుగు సమీపంలో జేఎస్‌డబ్ల్యు సంస్థచే నిర్మించ తలపెట్టిన స్టీల్ ప్లాంట్ కడప సిగలో మణిహారంగా నిలవనుంది. తొలివిడతగా రూ.3,300 కోట్ల వ్యయంతో 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 2023 ఫిబ్రవరి 15న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.720 కోట్లు వెచ్చించి మౌలిక వసతులను సమకూర్చింది. నాలుగు లేన్ల రహదారి, రైల్వే కనెక్టివిటీ, నీటి వసతి కోసం పైపు లైన్ ఏర్పాటు, నీరు నిల్వ చేసుకునేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్, భవన సముదాయం అందుబాటులోకి తెచ్చారు. విస్తరణ అనంతరం రూ.8800 కోట్ల పెట్టుబడి, 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో 25వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించేలా రూపకల్పన చేశారు.

భక్తిశ్రద్ధలతో గఫారియా ఉరుసు



విద్యుద్దీపాల అలంకరణలో దర్గా–ఏ–గఫారియా,ఖాదరియా

భక్తులతో కిటకిటలాడిన దర్గా ప్రాంగణం

కమలాపురం: కమలాపురం పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, శ్రీ హజరత్ మౌలానా మౌల్వి ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, శ్రీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల ఉరుసు మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రధాన ఉరుసు భక్తుల కోలాహలం నడుమ వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి ముస్లిం, హిందు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈ దర్గాకు కులమతాలకు అతీతంగా భక్తులు వేలాదిగా తరలి రావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు దర్గాలోని స్వామి వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి చదివింపులు చేశారు. అలాగే పీఠాధిపతి మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రిని భక్తులు గౌరవ పూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. భక్తులకు మోహన్ బీడి యజమాని ఎస్. మహబూబ్ సాహెబ్ అన్నదానం ఏర్పాటు చేశారు.

అలరించిన ఖవ్వాలి పోటీ

కమలాపురం పెద్ద దర్గా ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని దర్గా ఆవరణంలో ఏర్పాటు చేసిన ఖవ్వాలి పోటా పోటీగా సాగింది. ప్రఖ్యాతిగాంచిన రాజస్థాన్‌కు చెందిన సలీమ్ సాబిరి, ముంబయికి చెందిన కలీం నయామ్ హష్మి ల మధ్య రెండో రోజు గొప్ప ఖవ్వాలి పోటీ రసవత్తరంగా సాగింది. ఖవ్వాలి ప్రేమికులు పాటలను వింటూ ఖుషీ ఖుషీగా నజరానా సమర్పించారు. బుధవారం రాత్రి ప్రారంభమైన ఖవ్వాలీ పోటీ గురువారం తెల్లవారుజామున వరకు సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఖవ్వాలి ప్రియులతో దర్గా మైదానం కిక్కిరిసింది.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని దర్గా ప్రాంగణంలో నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి ఐదు జతల కాండ్లు రాగా గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు దాతల సహకారంతో వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులను అందజేశారు. నేడు తహలీల్‌తో ఉత్సవాలు ముగియనున్నాయి.

నేడు సీఎం వైఎస్ జగన్ రాక

- సీఎస్ఐ చర్చి మైదానంలో భారీ బహిరంగ సభ
- నామినేషన్ దాఖలు చేయనున్న వైఎస్ జగన్



పులివెందుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పులివెందులకు రానున్నారు. ఉదయమే పులివెందులకు చేరుకోనున్న వైఎస్ జగన్ స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంలో భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా అంబకపల్లె రోడ్డులో ఉన్న మినీ సెక్రటేరియట్‌లో గల ఆర్‌ఓ కార్యాలయానికి చేరుకుని అక్కడ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం భాకరాపురంలోని తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కాసేపు గడపనున్నారు.

సీఎం పర్యటన ప్రాంతాలను పరిశీలించిన ఎంపీ

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పరిశీలించారు. బుధవారం సాయంత్రం ఆయన సీయస్ఐ చర్చి మైదానానికి చేరుకుని అక్కడ బహిరంగ సభకు జరిగే ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగసభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో అందుకుతగ్గ ఏర్పాట్లను చేయాలని నిర్వాహకులకు సూచించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ, నామినేషన్ కార్యక్రమాన్ని ప్రజలందరు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, సీఎం కార్యాలయ కో–ఆర్డినేటర్ జనార్దన్ రెడ్డి, సీఎం వ్యక్తి గత కార్యదర్శి రవిశేఖర్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చవ్వా సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ఐ మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు

సీఎం పర్యటన ఇలా...

- గురువారం ఉదయం 7.45గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలోని తన నివాసం నుంచి గన్నవరం ఎయిర్ పోర్టుకు బయలుదేరుతారు.
- 8.05గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 8.15 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో కడప ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.
- 9.05గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 9.10గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి పులివెందులకు హెలికాప్టర్‌లో బయలుదేరుతారు
- 9.40గంటలకు పులివెందుల భాకరాపురంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 9.50 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్ నుంచి వైఎస్సార్ ఉలిమెల్లలేక్ ఫ్రంట్ రోడ్డు ద్వారా సీయస్ఐ చర్చి మైదానానికి బయలుదేరుతారు.
- 10.00గంటలకు సీయస్ఐ చర్చి మైదానానికి చేరుకుంటారు.
- 10 నుంచి 11.15 గంటల వరకు సీయస్ఐ చర్చి మైదానంలో బహిరంగ సభలో పాల్గొంటారు.
- 11.25గంటలకు మినీ సెక్రటేరియట్‌లోని ఆర్‌ఓ కార్యాలయానికి చేరుకుంటారు 11.25 గంటల నుంచి 11.40గంటల వరకు ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు
- 11.40 గంటలకు ఆర్‌ఓ కార్యాలయం నుంచి భాకరాపురంలో గల తన స్వగృహానికి బయలు దేరుతారు.
- 11.45గంటలకు భాకరాపురంలోని స్వగృహానికి చేరుకుంటారు
- 11.45 గంటల నుంచి 12.15 గంటల వరకు రిజర్వ్
- 12.15 గంటలకు స్వగృహం నుంచి భాకరాపురంలో హెలిప్యాడ్‌కు బయలుదేరుతారు.
- 12.25 గంటలకు భాకరాపురంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.30 గంటలకు హెలిప్యాడ్ నుంచి కడప ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్తారు.
- 1.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 1.10 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు

ఆరో రోజు 67 నామినేషన్ల దాఖలు

- లోక్‌సభకు 11, అసెంబ్లీలకు 56
- నేడు నామినేషన్లకు చివరిరోజు

కడప సెవెన్‌రోడ్స్ : లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఆరవరోజైన బుధవారం జిల్లాలో మొత్తం 67 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో కడప లోక్‌సభ స్థానానికి 11, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 56 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు లోక్‌సభ రిటర్నింగ్ అధికారి విజయరామరాజు, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు నామినేషన్లను స్వీకరించారు. గురువారం నామినేషన్ల దాఖలుకు ఆఖరు గడువు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చివరిరోజు నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు.



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎస్‌బీ అంజద్‌బాషా

- కడప లోక్‌సభకు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి (టీడీపీ) పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

కడప అసెంబ్లీకి సంబంధించి.. ఎస్‌బీ అంజద్‌బాషా (వైఎస్సార్ కాంగ్రెస్–2 సెట్లు), ఆర్.మాధవీరెడ్డి (టీడీపీ–2 సెట్లు), ఆర్.శ్రీనివాసులురెడ్డి (టీడీపీ), ఎస్‌బీ అహ్మద్‌బాషా (వైఎస్సార్ సీపీ) తుమ్మన్ కల్యాన్ అఫ్జల్ అలీఖాన్ (కాంగ్రెస్)తో పాటు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు.


పులివెందుల.. మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (టీడీపీ), ఎం.ధృవకుమార్‌రెడ్డి (కాంగ్రెస్)తో పాటు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే బద్వేలుకు సంబంధించి బొజ్జా రోశన్న (బీజేపీ), కమలాపురం .. పల్లా వెంకట రామిరెడ్డి, జమ్మలమడుగు.. పాముల బ్రహ్మానందరెడ్డి (కాంగ్రెస్), చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి (బీజేపీ), ప్రొద్దుటూరు.. రాచమల్లు రమాదేవి (స్వతంత్ర్య), రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ) , మైదుకూరు.. గుండ్లకుంట శ్రీరాములు (కాంగ్రెస్), పుట్టా రవికుమార్ యాదవ్ (టీడీపీ), పుట్టా సుధాకర్ (టీడీపీ)తో పలు పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు నామినేషన్లు వేశారు.

కోదండ రాముడే..కాళీయ మర్దనుడు

ఒంటిమిట్ట: ఏకశిలానగరిలో కొలువైన కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు బుధవారం ఉదయం కాళీయమర్దన అలంకారంలో జగదభిరాముడిని ముస్తాబు చేశారు. పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామి వారు పురవీధుల్లో విహరించారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. తిరిగి సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు.

అశ్వవాహనంపై ఒంటిమిట్ట విభుడు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదోవ రోజు గురువారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో అశ్వ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.



కాళీయమర్దన అలంకారంలో ఆశీనుడైన శ్రీరాముడు

క్లుప్తంగా

లక్ష్మీనరసింహుడి సన్నిధిలో సినీ హీరో సుమన్


స్వామి సన్నిధిలో సినీ హీరో సుమన్

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామిని బుధవారం సినీ హీరో సుమన్ దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి సుమన్‌కు స్వామి వారి తాంబూలం, రక్షణ కంకణం, పవిత్రమాల అందించి లక్ష్మీనరసింహస్వామి సంపూర్ణ ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఆలయ పూజారి పెంచలయ్య స్వామితో తనకు చాలా కాలం నుండి పరిచయం ఉందని, సినీ పరిశ్రమలో స్వామివారికి మంచి పేరు ఉందని అన్నారు. అనంతరం స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పి.ఎస్ పరిధిలో తిలక్‌నగర్‌లో 2020లో నమోదైన కేసులో ఓ మహిళను అసభ్యకర పదజాలంతో దూషించడంతో పాటు, ఆమెను కొట్టి గాయపరిచారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో కడపలోని జిల్లా కోర్టులో జెఎఫ్‌సి అండ్ స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ హేమస్రవంతి జానకిరామ్ తీర్పు చెప్పారు. కేసులో నిందితులైన తమ్మిశెట్టి రామసుబ్బయ్యకు మూడునెలల జైలు శిక్ష, రెండవ నిందితుడు మంజు శ్రీనుకు ఏడాదిపాటు జైలు శిక్షతో పాటు, రూ. 5000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు వివరాలను ప్రస్తుత రిమ్స్ పీఎస్ సీఐ కె. రామచంద్ర తెలియజేశారు.

కేసుల నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీ, ఊరేగింపులతో వచ్చిన టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ నేతలు కోటిరెడ్డి సర్కిల్, హెడ్ పోస్టాఫీసుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా టపాసులు పేల్చారని రెండు పార్టీల నేతలపై మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎం.సి.సి) కింద కేసులను నమోదు చేశారు.

- కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్వారకానగర్‌లో నివాసం వుంటున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసుల రెడ్డి (వాసు), ఆయన సతీమణి, కడప టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఆర్. మాధవిలు తమ ఇంటి నుంచి వాహనాలతో పాటు భారీగా ర్యాలీగా ఏడు రోడ్ల కూడలి సమీపంలో వున్న కడప ఆర్డీఓ కార్యాలయానికి బుధవారం ఉదయం విచ్చేశారు. ఈక్రమంలో కడప కోటిరెడ్డి సర్కిల్ కూడలిలో నిబంధనలకు విరుద్ధంగా టపాసులు పేల్చారని ఎస్‌టిఎఫ్ బృందంకు చెందిన ఎస్. నాగరాజు ఫిర్యాదు మేరకు టీడీపీ నేతలైన పై ఇద్దరిపైన కడప ఒన్‌టౌన్ సీఐ సీ. భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.
- మరోవైపు డిప్యూటీ సీఎం ఎస్.బి అంజాద్ బాషా వైఎస్ఆర్‌సీపీ తరపున కడప అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు తమ సోదరుడు ఎస్.బి. అహ్మద్‌బాషాతో పాటు, వేలాదిగా వైఎస్ఆర్‌సీపీ అభిమానులతో కలిసి ర్యాలీగా తమ ఇంటి నుంచి బయలుదేరారు. హెడ్ పోస్టాఫీసు దగ్గరికి రాగానే టపాసులను నిబంధనలకు విరుద్ధంగా పేల్చారని ఎస్‌టిఎఫ్ టీం సభ్యుడు విశ్వనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

జగన్ మళ్లీ సీఎం కావాలనేది జనం కోరిక

- ఎన్నికల్లో ప్రజలు బాగా ఆలోచించి ఓటేయాలి
- టీడీపీ పాలనలో ఈ జిల్లాను ఎలా నిర్లక్ష్యం చేశారో అందరికీ తెలుసు
- కడపలో అభివృద్ధి కొనసాగాలంటే జగనన్న మళ్లీ రావాలి
- నామినేషన్ తర్వాత మీడియాతో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా


నామినేషన్ వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలనేది జనం కోరిక అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. బుధవారం ఆయన 9.30 గంటలకు బీకేఎం వీధిలోని తన నివాసం నుంచి భారీ ర్యాలీగా వచ్చి 11.30 గంటలకు పాత కలెక్టరేట్ పక్కనున్న ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ వేశారు. అనంతరం కళాక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు ఈ రాష్ట్రాన్ని పాలించారని, వారందరిలో ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తు.చ తప్పకుండా అమలు చేసిన ఘనత వైఎస్సార్, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకే దక్కుతుందన్నారు. వైఎస్ జగన్ రాష్ట్రంలో సువర్ణ పాలన అందజేశారన్నారు. తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్ట నష్టాలను కళ్లారా చూసిన ఆయన అధికారంలోకి రాగానే నవరత్నాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాలకు మేలు చేశారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు చేరుతున్నాయా లేదా అని తెలుసుకోవడానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించారన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు ప్రజలముందుకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉండేదని, తాము అన్ని హామీలు అమలు చేశామనే గర్వంతో వెళ్లామన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా జగనన్న పాలన సాగిందన్నారు. దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన ఈ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపింది వైఎస్సార్, వైఎస్ జగన్‌లేనని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కడప నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, నగరంలో రూ.450కోట్లతో 7 రహదారులను విస్తరించి, అభివృద్ధి చేశామన్నారు. వైద్యం కోసం కర్నూల్, తిరుపతి, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే అవసరం లేకుండా రిమ్స్ హాస్పిటల్‌ను రూ.200కోట్లతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేశామన్నారు. కేన్సర్ హాస్పిటల్, మానసిక వైద్యశాల, ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల, పుష్పగిరి కంటి ఆసుపత్రులతోపాటు 9 అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించామన్నారు. రూ.58కోట్లతో అసంపూర్తిగా ఉన్న బుగ్గవంక రక్షణ గోడలు పూర్తి చేసి, వాటి చుట్టూ రూ.15కోట్లతో 40 అడుగుల అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. టీడీపీ ఐదేళ్ల పాలన ఎలా జరిగిందో జిల్లా ప్రజలకు, కడప ప్రజలకు బాగా తెలుసన్నారు. కడపలో ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, నాయకులు పి. జయచంద్రారెడ్డి, షఫీ, పవర్ అల్తాఫ్, దాసరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 16న ప్రతిభా పురస్కారం

కడప ఎడ్యుకేషన్ : వైఎస్ఆర్ జిల్లా పద్మశాలి విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ 2023–24 విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నామని ఆ సంఘం అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో 500 మార్కులు పైన, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 900 మార్కులుపైన, ఆర్ట్స్ గ్రూపులలో 800 మార్కులు పైన, ఐఐటి, ఎంసెట్, ఇంజనీరింగ్, నీట్, మెడిసిన్‌లో జిల్లాస్థాయిలోనే కాక కడప పట్టణ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన పద్మశాలీ విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులని తెలిపారు. విద్యార్థులు తమ మార్కుల జాబితాతోపాటు టీసీ జిరాక్స్ కాపీలు, రెండు పాస్ పోర్టు సైజు ఫోటోలు, ఫోన్ నెంబర్, బయోడేటాతో సహా పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 10వ తేదీలోపు పద్మశాలిభవన్ కళ్యాణ మంటపం, 38/166–5, చిన్నచౌక్, తిరుపతి రోడ్డు కడప–516002 చిరునామాకు చేరేలా పంపాలని తెలిపారు. అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు పొందిన విద్యార్థుల జాబితాను జూన్ 12వ తేదీ సంఘం కార్యాలయంలో ప్రకటించి ఫోన్ ద్వారా తెలియజేస్తామని చెప్పారు. జూన్ 16వ తేదీ పద్మశాలి కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. వివరాలకు 98490 26877 సంప్రదించాలని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. మదనపల్లి పట్టణం నీరు గట్టు వారి పల్లె చౌడేశ్వరి నగర్ కు చెందిన చెన్నప్ప కుమారుడు ఆర్ ఈశ్వరయ్య (39) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో పట్టణంలోకి వస్తుండగా, టిప్పు సుల్తాన్ మైదానం వద్ద మసీదు సమీపంలో, ఎదురుగా మరో ద్విచక్ర వాహనం అకస్మాత్తుగా రావడంతో అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా చిత్తూరు జిల్లా చౌడేపల్లె మేదర వీధికి చెందిన తండ్రి కొడుకులు ఎస్ ఫర్హాన్ (14), మహమ్మద్ రియాజ్ ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనులపై వెళ్తుండగా, చౌడేపల్లి– సోమల మార్గంలోని సింగిరి గుంట వద్ద ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 లో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలోకి కొనసాగుతున్న చేరికలు


వెంకట్రామ్‌పల్లెలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


పార్టీలో చేరినవారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ పంచాయితీలోని వెంకట్రామ్‌పల్లెలో 20 కుటుంబాలు బుధవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో మల్లారెడ్డి, వెంకటసుబ్బమ్మ, సురేష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాగమునెమ్మ, ఈశ్వర్ రెడ్డి, పద్మావతి, చిన్న నాగమల్లారెడ్డి తదితరులు ఉన్నారు. ఈకార్యక్రమంలో పొలతల ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనువాసులురెడ్డి, సుబ్బారెడ్డి, నాగమల్లారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు.

50 కుటుంబాలు చేరిక

చింతకొమ్మదిన్నె : మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె పరిధిలోని ఆజాద్ నగర్ గ్రామంలో బుధవారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు సంబంధించిన ముస్లింలు వైఎస్ఆర్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలకు, కులాలకు మతాలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతి ఒక్కరు కూడా టీడీపీ నుంచి వైఎస్ఆర్ సీపీలో చేరుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కడప పార్లమెంటు సభ్యుడిగా వైఎస్ అవినాష్ రెడ్డిని, కమలాపురం శాసనసభ్యుడిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, రామయ్య, శ్రీనివాసులు, మండల యూత్ అధ్యక్షుడు గజ్జల ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గజ్జల శ్రీరామ్ రెడ్డి, ఏపీ వీడియో కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, నీలకంఠారెడ్డి, లక్కిరెడ్డి రమణారెడ్డి, ఓబుల్ రెడ్డి, ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

70 ముస్లిం కుటుంబాలు చేరిక

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ 14వ వార్డులో బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో 70 ముస్లిం కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన మైనారిటీ విభాగం పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ ఎద్దుల బండి షరీఫ్, జెడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాబు చాన్, షేక్ కడప ఖాసిం (మున్నా), పెద్ద ఖాజా, మైను, సర్దార్, దస్తగిరి బాషా, షఫీ బాషా(బిస్మిల్లా), హాజీ, ఆరిఫ్, హుస్సేన్, పీరాన్ సాబ్ గారి మాబువల్లి, షేక్ సుమన్, జావీద్, అబ్దుల్, షరీఫ్, అన్వర్, దిల్షాద్, గౌసియా, రుక్సానా, కరీమున్, హసీనా, బి.మాబుచాన్, అకీర్ మునిసా, షేక్ మాబు చాన్, మున్ని, కరిష్మా, కదిరూన్, ఇమాంబి, రమీజా, శంషాద్, షరీఫ్ (సునీల్), అబ్దుల్, ఆరిఫ్, మహమ్మద్ గౌస్, ఇమామ్, నజీర్, ఖాసిం, షబ్బీర్ తదితర 70 కుటుంబాల వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేవీ లింగన్న, భరత్ కుమార్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి బ్యాటరీ ఖాదర్, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, కార్యదర్శి ముజఫర్, రామదాసు, గోశెట్టి రామచంద్ర, సొద్దల సురేష్, సన్నా శ్రీనురావు, ఇర్షాద్, గౌస్ లాజం, గౌస్ పీర్, నాయబ్ రసూల్, ఖలీల్, దాదాపీర్, పఠాన్ చాంద్‌బాషా, విశ్వనాథ ఆచారి, పాశం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్


వైఎస్సార్‌సీపీలో చేరిన బండి విజయభాస్కర్ రెడ్డితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : తెలుగుదేశం పార్టీలో ఉంటూ అదే పార్టీని పలు సందర్భాలలో దూషించిన మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికే మళ్లీ టికెట్ ఇచ్చారు.. పార్టీ కోసం నాలుగేళ్లపాటు పోరాటం చేసిన ప్రవీణ్ కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తామని స్వయంగా తన ఎదుటే చెప్పి చంద్రబాబు నాయుడు మోసం చేశారని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేకే తాను టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలిమారు పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. బుధవారం రాత్రి పెద్దశెట్టిపల్లె గ్రామంలో బండి విజయ భాస్కర్‌రెడ్డి పార్టీలో చేరుతున్న సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

మహిళకు తీవ్ర గాయాలు


గాయపడిన రాజమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ... రాయచోటిలోని రామాపురానికి చెందిన రాజమ్మ తన కుమారుడు కలిసి ద్విచక్ర వాహనంలో మహల్లోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకొని తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో సంబేపల్లె మండల కేంద్రంలోకి రాగానే రాజమ్మ ద్విచక్ర వాహనం నుంచి జారి పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజమ్మను 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

- ఒకరి మృతి
- నలుగురికి గాయాలు



వేముల : మండలంలోని గొందిపల్లె సమీపంలో బుధవారం అదుపుతప్పి కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అనంతపురానికి చెందిన శ్రీనివాసులు కుటుంబంతో కలిసి కారులో కడపకు బయలుదేరారు. గొందిపల్లె గ్రామ సమీపానికి రాగానే టీవీఎస్ వాహనాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పి కుడివైపు ఉన్న పొలాల్లో ఫల్టీలు కొడుతూ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శుద్ధ అనే యువతి మృతిచెందింది. కాగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి పరిస్థితి విషమించిన సంఘటన బుధవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. రామాపురం గ్రామానికి చెందిన రెడ్డి బాబు కుమారుడు నితీష్ (24) ఐటిఐ పూర్తి చేసి బెంగళూరులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల గ్రామంలో జరుగుతున్న తిరునాళ్లకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం వరకు ఉత్సాహంగా ఉన్న నితీష్ ఆపై ఏం జరిగిందో తెలియదు కానీ ఇంటి వద్ద పిడుదుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి అక్కడి నుంచి వాల్మీకిపురం కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగ వైద్యులు చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉందని తిరుపతికి వెళ్లాల్సిందిగా రెఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు బాధితున్ని ప్రైవేట్ అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు. గుర్రంకొండ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అక్రమ మద్యం సీజ్

కలకడ : మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతనివద్ద ఉన్న మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం మండలంలోని కలకడ ప్రభుత్వ ఆసుపత్రి దారిలో సయ్యద్‌బాష కిరాణాషాపు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పఠాన్ సయ్యద్‌బాష అనే వ్యక్తి వద్ద 50 మద్యం బాటిళ్లు ఉండగా గుర్తించి సీజ్ చేసి వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్నోవా కారు సహా మద్యం పట్టివేత

బి.కొత్తకోట : సరిహద్దులోని మండలంలోని బడికాయలపల్లె చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇన్నోవా కారు పట్టుబడింది. సీఐ సూర్యనారాయణ కథనం మేరకు వివరాలు.. 90 ఎంఎల్ ప్యాకెట్లు 47, 180 ఎంఎల్ ప్యాకెట్లు 17తో వస్తున్న కారును చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి తనిఖీ చేయగా మద్యం పట్టుబడిందని తెలిపారు. ఈ కేసులో పెద్దతిప్పసముద్రం మండలం కాట్నగల్లు పంచాయతీకి చెందిన హరి (32)ని అరెస్ట్ చేయగా మరో ఐదుగురు పరారైనట్లు తెలిపారు. పరారైన నిందితుల వివరాలను వెల్లడించలేదు. కాగా నిందితుల్లో పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలకు చెందిన టీడీపీ నాయకులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అదనపు కట్నం తేలేదని భార్యపై భర్త దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అర్షియా

మదనపల్లె: అదనపు కట్నం కోసం వేధిస్తూ భార్యపై భర్త దాడి చేసిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. తన కుమార్తెను చంపేస్తారంటూ బాధితురాలు తండ్రి ముదివేడు పోలీసులను ఆశ్రయించి, అత్తవారింటి వేధింపులపై ఫిర్యాదు చేశాడు. వివరాలు... నంది రెడ్డి గారి పల్లెకు చెందిన ఖాదర్ వలీ, అఖిల దంపతుల కుమార్తె ఎస్.అర్షియా(20)ను నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన, గ్రామ వలంటీర్, డ్రైవర్‌గా పనిచేస్తున్న ఖాదర్ వలీకి ఇచ్చి వివాహం జరిపించారు. కొంతకాలం వీరి కాపురం సవ్యంగా సాగింది. ఏడాది తర్వాత నుంచి అదనంగా రెండు లక్షలు కట్నం తేవాలంటూ భార్యను తరచు ఖాదర్‌వలీ వేధించేవాడు. ఈ క్రమంలో ఆమె పుట్టింటికి చేరుకోగా, పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. మూడు నెలల క్రితం తిరిగి అత్తవారింటికి వెళ్ళింది. అప్పటి నుంచి అదనపు కట్నం కోసం వేధింపులు ఎక్కువయ్యాయి. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో భర్త ఖాదరవల్లి, అత్త హనీఫా అదనపు కట్నం కోసం మరోసారి వేధించి గొడవపడ్డారు. ఈ క్రమంలో భర్త... అర్షియా తలను గోడకేసి కొట్టి దాడి చేయడంతో,ఆమె తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు 108 లో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అరటితోట దగ్ధం


కంచెకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిన అరటిచెట్లు

ఓబులవారిపల్లె: ఆకతాయిలు అరటితోట కంచెకు నిప్పు పెట్టడంతో ఎర్రబాబు శంకర్ రెడ్డికి చెందిన ఐదు ఎకరాల అరటితోట దగ్ధమైంది. ముక్కవారిపల్లె జాతీయ రహదారి సమీపంలో గ్రామానికి చెందిన ఎర్రబాబు శంకర్ రెడ్డికి చెందిన అరటితోట కంచెకు గుర్తు తెలియని ఆకతాయిలు బుధవారం నిప్పు పెట్టారు. ఎండకు బాగా ఎండి ఉన్న కంచె ఒక్కసారిగా అంటుకోవడంతో మంటలు చెలరేగి ఐదు ఎకరాలలో అరటి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అలాగే డ్రిప్ పరికరాలు కూడా కాలిపోవడంతో రైతుకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. హుటాహుటిన రైల్వేకోడూరు అగ్నిమాపక సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

ప్రచారంలో పదనిస



పెనగలూరు మండలం కోమంత రాజుపురం పంచాయతీ బెస్తపల్లెలో వైఎస్ఆర్‌సీపీ నేతలు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఓ టిఫిన్ సెంటర్‌లో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి దోశ వేసి ఆకట్టుకున్నారు.
– ఓబులవారిపల్లె

డబ్బులు ఇస్తేనే పోటీలో జహా

- ఒప్పందం ప్రకారం డబ్బులు డిపాజిట్ చేయని వైనం
- ప్రచారం చేయవద్దని అధిష్టానం చెప్పిందంటూ గుసగుసలు
- డబ్బుల లెక్క తేల్చేందుకు మదనపల్లెకు వచ్చిన పరిశీలకులు
- నామినేషన్ వేసేందుకు మరో మైనారిటీని సిద్ధం చేసిన నాయకులు


టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో..మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా(జహా)ను మార్చేస్తున్నారంటూ పట్టణంలో ప్రచారం జోరైంది. టీడీపీకి ఒప్పందం ప్రకారం డబ్బులు డిపాజిట్ చేయకపోవడంతో ఆయన్ను పోటీ నుంచి తప్పించి, మరో మైనారిటీకి అవకాశం ఇవ్వాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. నిన్నటిదినం పార్టీ తరపున పరిశీలకులు ఎమ్మెల్సీ రామభూపాల్‌రెడ్డి, నాయకులు దీపక్‌రెడ్డి మదనపల్లెకు వచ్చి షాజహాన్‌బాషాతో డబ్బు విషయమై చర్చలు జరిపారు. పార్టీతో సీటు ఖరారు విషయంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం డబ్బులు డిపాజిట్ చేయాలని, ఇప్పటికే సమయం మించిపోయిందని, నాన్చుడు ధోరణి ఇక ఏమాత్రం తగదని ఘాటుగానే హెచ్చరించారని తెలిసింది. బీ–ఫారం తెచ్చేసుకున్నానన్న ధీమా విడిచిపెట్టాలని, చివరి నిమిషంలోనైనా అభ్యర్థిని మార్చేందుకు వెనుకాడేది లేదని ఖరాఖండిగా తేల్చేసినట్లు తెలిసింది. దీనికి....తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాకే, నియోజకవర్గంలో అవసానదశలో ఉన్న టీడీపీకి ఊపు వచ్చిందని, తనను తప్పిస్తే పార్టీ గట్టెక్కదని చెప్పినట్లు తెలిసింది. దీంతో టీడీపీ అధిష్టానం పంపిన నాయకులు... టీడీపీ సింబల్‌తో ఎవరినైనా గెలిపించే సత్తా పార్టీకి ఉందని, మీరు లేకున్నా..పార్టీకి వచ్చిన నష్టం ఏమీ లేదని, ఆలోచించుకోవాల్సిందిగా చెప్పేసి వెనుదిరిగారని భోగట్టా. డబ్బున్న మైనారిటీ నాయకుల కోసం వెతుకులాటలో... ఇప్పటికే పట్టణంలో ఓ మైనారిటీ నాయకుడు, హోటల్ యజమానిని నామినేషన్ వేసే దిశగా సన్నద్ధం చేసి అన్ని ప్రయత్నాలు చేసినట్లు పట్టణంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనికితోడు బుధవారం షాజహాన్‌బాషా ఉదయం నుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఉదయం 11 గంటల వరకు ఇంటివద్దే ఉండటం... గుసగుసలకు బలం చేకూర్చింది. తర్వాత రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్‌కు వెళుతున్నానని, షాజహాన్‌బాషా రాయచోటికి బయలుదేరి వెళ్లారు. ఇదిలాఉంటే... టీడీపీ అసంతృప్తనాయకులు అభ్యర్థి షాజహాన్‌బాషాకు ఏమాత్రం సహకరించడం లేదు. పైపెచ్చు నామినేషన్ల చివరిరోజైన గురువారం టీడీపీ ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేష్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తారని ప్రచారం జరుగుతోంది.